


38వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -నెల్లూరు

నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ల నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ మంగళవారం స్థానిక 38వ డివిజన్ టెక్కే మిట్ట ప్రాంతంలో పర్యటించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న నూతన డ్రైను కాలువల నిర్మాణం పనులను తనిఖీ చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ మాజీ మేయర్ భానుశ్రీ, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైసిపి 2024 ఎన్నికల ముందు వరకు ఆడిందే ఆట...పాడిందే పాటగా సాగింది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోనే ఆపార్టీకి బలమైన జిల్లాగా జాబితాలో నెల్లూరు ఉంది. ఎంపీలు, 10 మంది ఎంఎల్‌ఎలు, జెడ్‌పి ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్, ఎంపిపి, జెడ్‌పిటిసి ఒక్కటేమిటి జిల్లాలోని ప్రజా ప్రతినిధుల్లో 90 శాతం మంది ఆపార్టీ నుంచే ఎన్నికయ్యారు. గ్రావెల్, ఇసుక, మైనింగ్, సెటిల్‌మెంట్స్, అంతా ఆపార్టీ నేతల కనుసైగల్లోనే నడిచింది. బాగానే వెనుకేసుకున్నారనే ప్రచారం జరిగింది. మళ్లీ అధికారం మనదే అన్నట్లు భయం లేకుండా వ్యవహరించారు. 2024 ఎన్నికల్లో వైసిపికి భారీ దెబ్బతగిలింది. ఎంపి, ఎంఎల్‌ఎలు టిడిపి కైవసం అయ్యాయి. అప్పటి నుంచి వైసిపి నేతలు మౌనదీక్ష చేస్తున్నారు. పార్టీ అధ్యక్షులుగా కాకాణి గోవర్దన్‌రెడ్డి వారానికి రెండు, మూడు మీడియా సమావేశాలు, అప్పడప్పుడు ఆందోళన నిర్వహించి వైసిపి ఉందని చెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పుడు కాకాణి అరెస్ట్‌తో వైసిపిలో రాజకీయ కుదుపు ఏర్పడింది. వైసిపిలో పదవులు పొంది, ఆర్థికంగా బలంగా తయారైన నేతలందరూ ముఖం చాటేస్తున్నారు. పెద్ద పెద్ద రాజకీయ కుటుంబాలుగా చెప్పుకునే ఆదాల, మేకపాటి, నేదురుమల్లి, కనిపించడం లేదు. ఆపార్టీ నేతలు, కార్యకర్తల్లో భయం, ఆందోళన కనిపిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాను గాలికొదిలేశారనే ప్రచారం సాగుతోంది...

వైసిపిలో రాజకీయ కుదుపు..!

- 'కాకాణి'అరెస్ట్‌తో అయోమయం
- 'ఆదాల' అడ్రసు లేరు..
- 'మేకపాటి' కుటుంబానిది అదే బాట
- నేతల్లో భయం...కార్యకర్తల్లో ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాజకీయాల్లో ఎప్పుడు ఏమైనా జరగొచ్చు... ఓడలు బండ్లు... బండ్లు ఓడలు అవుతాయంటారు.. రాష్ట్రంలోనే వైసిపికి నెల్లూరు బలమైన కేంద్రంగా ఉంది. జిల్లాలోని నేదురుమల్లి, ఆదాల, మేకపాటి కుటుంబాలతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఎలు కీలకంగా వ్యవహరించారు. వైసిపి ఐదేళ్ల జిల్లా వ్యాపితంగా ఆపార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు సిలీకా, మైనింగ్, గ్రావెల్, ఇసుకతో, పాటు పెద్ద ఎత్తున సెటిల్‌మెంట్స్ చేశారనే ప్రచారం ఉంది. ఇదే క్రమంలో టిడిపి నేతలను భయపెట్టారు. కేసులు, దాడులు, దౌర్జన్యాలు అంతా జరిగాయి. మరో 30 సంవత్సరాలు వైసిపినే ఉంటుందనే భావనతో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు వ్యవహరించారు. ఈ సమయంలో టిడిపి నేతలు వైసిపికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు.అనేక ప్రజా సమస్యలపై అప్పుడప్పుడు మాట్లాడారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రతోపాట కొందరు నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు అవకాశం ఉన్నంత వరకు చేశారు. వైసిపి ప్రభుత్వంలో మేకపాటి కుటుంబం ఆత్మకూరు , ఉదయగిరిలో పనిచేసింది. ఆ కుటుంబం నుంచి మంత్రి పదవి దక్కించుకున్నారు. వారు ఏం చెబితే అదే జరిగింది. టిడిపి అక్కడ కనుమరుగైపోయింది. కావలిలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గ్రావెల్, మట్టి, జగన్న ఇళ్లు, రియల్ ఏస్టేట్‌లో అందిన వరకు దోచుకున్నారనే ప్రచారం ఉంది. కందుకూరులో మానుగుంట మహీధర్‌రెడ్డి, బుర్రా మధుసూధన్ తమ గ్రూపులను కాపాడుకుంటూ, రాజకీయాలు చేశారు. కోవూరు నుంచి ప్రసన్నకుమార్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్నారు. నెల్లూరు సిటి నుంచి అనిల్‌కుమార్‌యాదవ్ మంత్రిగా పనిచేశారు. ఇసుక, గ్రావెల్, క్రికెట్ బెట్టింగ్ వంటి సమస్యల్లో ఇరుకున్నారు. ఆయన అనుచరులు రెచ్చిపోయారు. నెల్లూరు రూరల్‌లోనూ వైసిపి నేతలు హడావుడి అంతా ఇంతా చేయలేదు. గూడూరు నియోజకవర్గంలో సంజీవయ్య, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, అటు, ఇటు గా పనిచేశారు. వైసిపి ప్రభుత్వంలో ఏం జరిగినా.. టిడిపి నేతలు కొందరు నిలబడ్డారు.



జైలుకు వెళ్తున్న మాజీ మంత్రి కాకాణి

'కాకాణి' అరెస్ట్‌తో అయోమయం..!

కాకాణి గోవర్దన్‌రెడ్డి అరెస్ట్‌తో వైసిపిలో అయోమయం నెలకొంది. అప్పుడు, ఇప్పుడు కాకాణి టిడిపి నేతలకు వ్యతిరేకంగా మాట్లాడారు. ప్రధానంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లక్ష్యంగానే ఎక్కువ మీడియా సమావేశాలు నిర్వహించారు. పార్టీ ఓటమి తర్వాత ఆపార్టీ అధ్యక్షులుగా కొనసాగుతోన్న కాకాణి గోవర్దన్‌రెడ్డి ఏడాది నుంచి ప్రభుత్వంపై ఒంటికాలితో లేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ . సోమిరెడ్డి పై నిప్పులు చెరిగారు. పలుమార్లు విద్యుత్ బిల్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఆందోళనలు నిర్వహించారు. అందరినీ కలుపుకు పోవడంతోపాటు, పార్టీకి పెద్ద దిక్కుగా కాకాణి కనిపించారు. పొదలకూరు రుస్తుం మైనింగ్ అక్రమమైనింగ్ విషయంలో ఆయన రెండు నెలలు పరారయ్యాడు. ఇప్పుడు జైలుకు వెళ్లారు. ఎప్పుడు బయటకు వస్తారో తెలీదు. ఇలాంటి సమయంలో పార్టీలోని ముఖ్యనేతలంతా కలిసి ఒక్కటిగా ఉన్నామనే భరోసా కల్పించాల్సి ఉంది. అనిల్‌కుమార్‌యాదవ్, పి. చంద్రశేఖర్‌రెడ్డి, మేరుగ మురళీ, ఆనం విజయకుమార్‌రెడ్డిలు కనిపిస్తున్నారు. గతంలో మంత్రులు, ఎంపి, ఎంఎల్‌ఎలుగా పనిచేసిన నాయకులు వైసిపి కార్యాయం వైపు చూడడం లేదు. రానున్న రోజుల్లో మరికొందరు నేతలు అరెస్ట్ అవుతారనే ప్రచారం సాగుతోంది. ఇలాంటి సమయంలో పార్టీ నేతలు, క్యాడర్‌లో మనో ధైర్యం కల్పించాలి. రేపు ఏం జరుగుతుందోననే భయం కార్యకర్తల్లో కనిపిస్తోంది. ఆపార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు కనిపించడం లేదు.

'ఆదాల' అడ్రసు లేరు..!

సీనియర్ నాయకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అడ్రసు కనిపించడం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడే ఉంటారనే ప్రచారం ఉది. వైసిపి ప్రభుత్వంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా కీలక వ్యహరించారు. కాంట్రాక్టు పనులు బాగానే చేసుకున్నారని చెబుతారు. సీనియర్ నేతగా చెప్పుకుంటూ ఇటీవల నెల్లూరు రూరల్ నుంచి ఎంఎల్‌ఎగా పోటీ చేశారు. వైసిపిలో ఇంత గందరగోళం జరుగుతున్నా ఆదాల ప్రభాకర్‌రెడ్డి అడ్రసు కనిపించడం లేదని ఆపార్టీ నేతలే అంటున్నారు. అధికారపార్టీకి భయపడి ఇటు వైపు చూడడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం వద్ద బిల్లులు పెండింగ్ ఉండడం, టిడిపి నాయకులతో కొందరితో సఖ్యతగా మెలుగుతోన్న ఆయన అంతకన్నా ముందుకు పోతే ఇబ్బందులు తప్పవనే భయంతో ఇక్కడకు రావడం లేదని తెలుస్తోంది. మేకపాటి కుటుంబం కూడా ఇదే దారిలో ఉంది. మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజారెడ్డి , కందుకూరు మధుసూధన్‌యాదవ్, కావలి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ ఆఫీసు ముఖం కూడా చూడడం లేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే నాలుగేళ్ల అధికారపార్టీ దాడిని తట్టుకోలేకుండా మౌనంగా ఉండడం తప్ప చేసేది ఉండదని ఆపార్టీ నాయకులు అంటున్నారు. కాకాణి బయటకొచ్చి, వ్యక్తిగత విమర్శలు కాకుండా ప్రభుత్వ విధానాలపై మాట్లాడుతారేమో చూడాలి.

దేశ సమగ్రత, పరిరక్షణ కోరుతూ

కొనసాగుతున్న సమైక్యత యాత్రలు



31వ డివిజన్‌లో..

ప్రజాశక్తి -నెల్లూరు

సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో మత సామరస్యం దేశ సమగ్రత పరిరక్షణ కోరుతూ మూడో రోజు యాత్రలు కొనసాగాయి. రూరల్ పరిధిలోని 31వ డివిజన్ రామకోటయ్య నగర్ కొత్తూరు 24వ డివిజన్ సుందరయ్య కాలనీ సి, డి బ్లాక్ నందు, 20, 21 డివిజన్ వనం తోపు, కొండయ్యపాలెం గేట్ సెంటర్ నందు సిపిఎం పార్టీ రూరల్ శాఖల ఆధ్వర్యంలో సమైక్యత యాత్రలు జరిగాయి. కాశ్మీర్లో ఉగ్ర ఘాతకం ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ఉగ్రవాదం నశించాలి, మతోన్మాదం నశించాలి, మతసామరస్యం వర్ధిల్లాలి నినాదాలు చేస్తూ కొత్తూరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కట్ట పెంచల నరసయ్య మాట్లాడారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు బి. నాగేశ్వర్ రెడ్డి, 31 డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎం సుధాకర్, సురేష్, షాహినా బేగం, పోతురాజు శ్రీనివాసులు, కంటే కోటేశ్వరరావు, రత్నం, వీర్ల శ్రీనివాసులు, రఘురామయ్య, రమణయ్య, పార్టీ సభ్యులు మాదాసు ముత్యాలు గంగాధర్, రమణారెడ్డి, సుబ్రమణ్యం, సుభాని, మా భాష, మున్వర్ బాయ్, ఎస్ డి హమీద్, ఎస్.కె నౌ షాద్, ఆదిశేషయ్య, సుకుమార్, సంతోష్, బద్దెపూడి రవి, ఖాదర్ బాషా పాల్గొన్నారు పాల్గొన్నారు.

ముతుకు రోడ్డు సెంటర్లో సమైక్యత ర్యాలీ

కాశ్మీర్లో ఉగ్ర ఘాతకం ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ 17వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ పక్కన జక్కా వెంకయ్య భవన్ నుంచి ఉగ్రవాదం నశించాలనే నినాదాలు చేస్తూ ముత్తుకూరు గేట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉగ్రవాద దాడుల్లో చనిపోయిన 26 మందికి సంతాపాన్ని తెలియపరుస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండ ప్రసాద్,రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కె.పెంచల నర్సయ్య, కట్టాసతీష్, 17వ డివిజన్ కార్యదర్శి షేక్.నజీర్, ఐద్వా నాయకులు మహాలక్ష్మి , దుర్గ భవానీ, మోషయ,మధు పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో..

మతసామరస్యం దేశ సమగ్రత పరిరక్షణకై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యత యాత్రలు 38వ డివిజన్ టేక్కేమిట్ట సెంటర్ నందు అమరవీరుల భవనం నుంచి ర్యాలీగా వెళ్లి ప్రచారం చేయడం జరిగిందిలి. లికార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె పెంచల నర్సయ్య, సిపిఎం నాయకులు ఎం. సుధాకర్, నందిపాటి మాలకొండయ్య, 38వ డివిజన్ శాఖ కార్యదర్శి వై ఈశ్వరయ్య, కే ఏడుకొండలు, కే రమణయ్య, కే వెంకటేశ్వర్లు,ఈ వెంకటేశ్వర్లు, ఏ బాలాజీ, మస్తానయ్య, ఏ ఏడుకొండలు, టి వెంకటేశ్వర్లు, దుష్యంత్ పాల్గొన్నారు.



38వ డివిజన్‌లో..

లింగ నిర్ధారణ పరీక్షల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -నెల్లూరు

జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు వైద్యుల సిఫార్సులు లేకుండా ఎట్టి పరిస్థితులలోనూ స్కానింగ్ పరీక్షలు చేయకూడదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డా. సుజాత తెలిపారు.మంగళవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు కోసం జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా స్థాయి సలహా సంఘం చైర్ పర్సన్ గా గైనకాలజిస్ట్ డా.సి.హెచ్ కిరణ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. డి యం హెచ్ ఒ డా. సుజాత మాట్లాడారు. డి.సి. హెచ్. ఎస్. డా.పరిమళ, పీడియాట్రీషన్ హెచ్.ఓ. డి. డా. సర్దార్ సుల్తానా, డి ఐ ఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.పి ఎల్ దయాకర్, డి.ఐ.పి.ఆర్.ఓ సదారావు, డెమో కె కనకరత్నం, ఎన్ జి ఓ ప్రతినిధులు కవితరెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.



విపిఆర్ రూ.5కోట్లు విరాళం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిడిపికి భారీ విరాళం ప్రకటించారు. కడపలో జరుగుతోన్న ఆ పార్టీ మహానాడులో మంగళవారం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పార్టీకి విరాళం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మహాసభకు హాజరైన మంత్రులు, ఎంఎల్‌ఎలు, నాయకులు తమ తమ స్థాయిలో పార్టీకి లక్షల్లో విరాళం ప్రకటించారు. తొలిరోజు రూ17కోట్లు విరాళం అందింది. చంద్రబాబునాయుడు పిలుపునందుకొని వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి రూ.5కోట్లు భారీ విరాళం ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా మహానాడులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరు మారు మ్రోగింది. పార్టీకి తోడ్పాటు అందిస్తున్న వేమిరెడ్డిని చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంపి

మామిడి రైతుల ఆందోళన

గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షం, ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. పంట చేతికి వచ్చే కాలంలో ఈ వర్షం కురవడం వల్ల కాయకి మంగు. మచ్చలు పడి ధర తగ్గిపోతుందని చెబుతున్నారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సముద్ర మొక్కల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలం, కర్లపాలెం గ్రామం, రామయ్య పట్నం పోర్ట్ సమీపంలో స్కంద మెరైన్ ఆల్గే సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సముద్ర తీరంలో ప్రత్యేకంగా సాగు చేస్తున్న సముద్ర మొక్కల (సీ వీడ్) సాగు విధివిధానాల గురించి డాక్టర్.ఎల్. సతీష్ శాస్త్రవేత్త పర్యవేక్షణలో 3 రోజులు క్షేత్ర సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆచరణాత్మక శిక్షణను తొలి రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ నుంచి వచ్చిన మత్స్యకారులకు సముద్రపు నాచు మొక్కల పెంపకంపై, మార్కెట్ స్ట్రాటజీపై డాక్టర్ సతీష్ వివరించారు. జిల్లా మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు నాగేశ్వరావు మత్స్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, మత్స్య శాఖ అభివద్ధి అధికారి లక్ష్మణ్ నాయక్ చ గామ సర్పంచ్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని మండలం మోచర్ల వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో మోచర్ల గ్రామానికి చెందిన గుద్దేటి రమాదేవి (45) దాసరి మమత వయసు (30) వారి ఇంటినుంచి గ్రామంలోని పోలేరమ్మ గుడికి వెళ్లేందుకు హైవే పక్కన వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. వారి అనంతరం మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎడ్లూరు సిఐ మంగారావు. గుడ్లూరు ఎస్సై వై వెంకట్రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హైస్కూల్ అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి -నెల్లూరు :పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ గారు మహా సంకల్పానికి శ్రీకారం చుట్టారని మంత్రి కుమార్తె పొంగూరు షరణి తెలిపారు. నెల్లూరు విఆర్సీ హైస్కూల్లో శరవేగంగా సాగుతున్న ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ కుమార్తె షరణి మంగళవారం సాయంత్రం పరిశీలించారు.

సర్వేకు ప్రాధాన్యత

నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలో టాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని కమిషనర్ వై.ఓ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్య దర్శులకు సూచించారు. రెవెన్యూ సెక్షన్ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల మేరకు ప్రతి అడ్మిన్ కార్యదర్శి సచివాలయ ఇతర కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వే నిర్వహించాలని సూచించారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -నెల్లూరు :చంద్రమౌళి నగర్, వేదాయపాలెం లోని కుమార్ ప్రథమ చికిత్స కేంద్రం ఆవరణము నందు మంగళవారం, సీనియర్ పిఎంపి సభ్యుడు కీర్తిశేషులు పయనం విజయ్ కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులచే అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్వర్ణభారత ట్రస్ట్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పీ.హెచ్.పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి -నెల్లూరు :పెండింగ్‌లోని వ్యవసాయ సర్వీసులకు యుద్ధ ప్రాతిపదికన చేయాలని, వ్యవసాయ సర్వీసెస్ రిలీజ్ లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్.ఈ. వి.విజయన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎస్.ఈ టెలీకాన్ఫెరెన్స్ అధి కారులతో మాట్లాడుతూ వచ్చే నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర యాప్ ద్వారా విద్యుత్ ఉద్యోగులందరూ రిజిస్ట్రేషన్లు చేసు కోవాలని అధికారులు వారి పరిధిలోని ఉద్యోగులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి -నెల్లూరు

పర్యాటక ప్రదేశమైన ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద స్వర్ణాల చెరువు ఒడ్డున బుధవారం జరిగే సామూహిక యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె .కార్తీక్ తెలిపారు. మంగళవారం ఆయన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు సామూహిక యోగా ఆంధ్ర కార్యక్రమం జరుగుతుందని, అధికారులు సిబ్బంది అందరూ ముందుగానే స్వర్ణాల చెరువు వద్దకు చేరుకుని సామూహిక యోగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు

కరపత్రాలు ఆవిష్కరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో విజయవంతం చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆకాంక్షించారు. యోగాంధ్ర- 2025 కార్యక్రమానికి సంబం ధించిన కరపత్రాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ మంగళవారం ఆవిష్కరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, యోగా మాస్టర్స్ రవీంద్ర, వెంకటసుబ్బయ్య, పద్మావతి, కావ్య , రేవతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మూడు రోజులు పాటు జరిగే యోగంధ్ర కార్యక్రమాన్ని ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. యోగాతో మానసిక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపిడిఒ తెలిపారు.

గంధమహోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలం,తెట్టు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సయ్యద్ సుల్తాన్ బీబీ అమ్మవారి 133వ గంధ మహోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గా ప్రెసిడెంట్ షేక్ జిలానీ బాషా, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన తెట్టు గంధ మహోత్సవానికి చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం వారు ప్రజాశక్తికి వివరించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా దాతల సహకారంతో ఈ గంధమహోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 50 వేల మందికి పైగా భక్తులు 29వ తేదీ రాత్రికి తెట్టు కు వస్తారన్న అంచనాల నేపథ్యంలో సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. సినీ గాయకులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.కావలికి చెందిన పాదర్తి సత్యప్రసాద్, పేరం శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో రూ 3లక్షల వ్యయంతో 29వ తేదీ గురువారం మధ్యాహ్నం 1500 మందికి, అదే రోజు రాత్రికి 5000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.



తెట్టు వద్ద గంధమహోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం

పటిష్టమైన ఏర్పాట్లు..

ఈనెల 29వ తేదీ రాత్రి తెట్టు గ్రామంలో నిర్వహించనున్న సయ్యద్ సుల్తాన్ బీబీ అమ్మవారి గంధోత్సవానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు గుడ్లూరు సిఐ జి మంగారావు పేర్కొన్నారు.29వ తేదీ రాత్రి భక్తుల సౌకర్యం కోసం పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ వి వెంకట్రావు తెలిపారు. తెట్టు దర్గా ప్రెసిడెంట్ షేక్ సుల్తాన్ బాషా, కమిటీ సభ్యులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి-కందుకూరు :

కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాలలో భాగంగా పేదలందరికీ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జూన్ 2న మండల కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని సిపిఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జూన్ 2వ తేదీ నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పి.మాలకొండయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన ఇచ్చిన హామీలల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చినా సూపర్ సిక్స్ పథకాలు ఇంతవరకు అమలు చేయడం లేదని మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ స్థలాలు పంపిణీ చేస్తామన్నారు.ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే మురళి,వై. ఆనందమోహన్, నాయకులు లక్ష్మీనారాయణ, ఉప్పుటూరు మాధవరావు, సిహెచ్ దుర్గాప్రసాద్, పి కోటేశ్వరరావు, యనమల కొండయ్య, బాల బ్రహ్మాచారి ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గ్రాంట్ ఇన్ ఎయిడ్ కొనసాగించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -నెల్లూరు : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నేతత్వంలో వి.ఆర్ హైస్కూలుకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కొనసాగించాలని, వి.ఆర్ కళాశాలను పునఃప్రారంభించాలని కోరుతూ నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో డి.ఆర్.ఓ ఉదయ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను.నరేంద్ర మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని వి.ఆర్సి సెంటర్ వద్ద ఉన్న వెంకటగిరి రాజాస్ హైస్కూల్ ఈ విద్యా సంవత్సరం నుంచి పునఃప్రారంభమైంది. అదే విధంగా వి.ఆర్ హైస్కూలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కొనసాగించాలని, కళాశాలను కూడా తిరిగి ప్రారంభించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్ పాల్గొన్నారు.



సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోండి

ప్రజాశక్తి -నెల్లూరు :సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజలందరూ అవగాహన పెంచుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూర్య ఘర్ బిజిలి యోజన' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ తెలియజేశారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్.ఈ విజయన్, ఈ.ఈ శ్రీధర్, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఈ.ఈ లు శేషగిరిరావు, రహంతు జానీ, డి.ఈ హిదాయతుల్లా, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

'కాకాణి' కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి కుటుంబాన్ని వైసిపి సీనియర్ నాయకులు పరామర్శించారు. మంగళవారం మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి పొదలకూరు రోడ్డులోని కాకాణి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు నిలవవని, కాకాణి బయటకొస్తారని, పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. ధైర్యంగా ఉండాలని కోరారు.



కాకాణి కుమార్తెను పరామర్శిస్తున్న నాగేశ్వరరావు, పి., చంద్రశేఖర్‌రెడ్డి

'మహానాడు'లో 'ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : కడపలో తొలిరోజు మొదలైన మహానాడు ప్రారంభోత్సవ వేడుకల్లో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ మంత్రులు, ఇతర శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కందుకూరు నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో డిటిపి శ్రేణులను పాల్గొనే విదంగా ఇంటూరి చర్యలు తీసుకున్నారు.



మహానాడులో ఎంఎల్‌ఎ ఇంటూరి

దేశ సమగ్రత కోసమే 'సమైక్యతా యాత్ర'

కావలిలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ - పలుచోట్ల కొనసాగిన యాత్రలు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-కావలి

దేశ సమగ్రత కాపాడడం కోసమే సిపిఎం పార్టీ సమైక్యతా యాత్రలను ప్రారంభించిందని జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కావలి పట్టణంలో మంగళవారం సమైక్యతా యాత్ర ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శన ఏరియా ఆసుపత్రి వద్ద నుండి బయల్దేరి కోర్టుసెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్ మీదుగా తిరిగి ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కాశ్మీరులో పెహల్గామ్‌లో పర్యాటకులపై తీవ్రవాదులు జరిపిన కాల్పులలో 26మంది చనిపోయారని, ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. అందులో కావలి పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావు కూడా ఉన్నారన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. కాల్పులు జరిపిన తీవ్రవాదులను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క తీవ్రవాదిని కూడా పట్టుకున్న సందర్భం లేదన్నారు. పాకిస్తాన్‌పై భారత్ యుద్ధం చేస్తుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం విరమించాలని కోరినప్పుడు వెంటనే భారత ప్రభుత్వం యుద్ధం విరమించిందన్నారు. భారతదేశంపై అమెరికా అధ్యక్షుడి పెత్తనం ఏమిటని, దాని వల్ల భారత దేశ సార్వభౌమత్వం దెబ్బతింటుందన్నారు. ఈ విషయాన్ని బిజెపి ప్రభుత్వం ఇప్పటికీ ఖండించలేదన్నారు. యుద్ధం చేసి ఏమి సాధించారని, ఏమి సాధించకపోగా దాన్ని కప్పి పుచ్చుకునేందుకు బిజెపి తిరంగా యాత్రలు జరుపుతుందన్నారు. అందుకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు రెండు మద్దతునివ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. కొంతమంది మతోన్మాదులు దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి దుర్మార్గాలను ప్రజలు సమైక్యంగా ఉండి తిప్పి కొట్టాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపి తీసుకొస్తున్న ప్రమాదకరమైన విధానాలను ప్రజలకు వివరించేందుకు సిపిఎం సమైక్యత యాత్రలు జరుపుతుందన్నారు. సిపిఎం ఎప్పుడూ ప్రజల తరపున నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. బిజెపి రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కలిసి, తీసుకు వస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం చేసే పోరాటాలలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంకా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.పుల్లయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కూడా ప్రసంగించారు. సిపిఎం సీనియర్ నాయకులు యస్.వెంకయ్య, పసుపులేటి తిరుపాలు, నాయకులు వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు యస్.మధు, ఎం.రమణయ్య, ఎస్కే మస్తాన్, బి.రమణయ్య, మహిళా నాయకులు ఎం.శైలజ, యమ్.మల్లీశ్వరి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



ముత్తుకూరులో..

ప్రజాశక్తి-ముత్తుకూరు : సిపిఎం ముత్తుకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఈపూరు గ్రామంలో మంగళవారం సమైక్యతా యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, మండల కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షా, ఈపూర్ శాఖ కార్యదర్శి ఉమామ్మ, సభ్యులు మస్తానమ్మ, పోలమ్మ, వెంకటరమణమ్మ, ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు : ఉగ్రవాదం నిర్మూలనలో భాగంగా మతసామరస్యం దేశ సమగ్రత పరిరక్షణ కోసం సిపిఎం నెల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యత యాత్రలను నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధనలు మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు పెద్దనోట్ల రద్దు సమయంలో నల్లధనాన్ని తీసుకొని వస్తామని ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని వాగ్దానాలు చేశారని కానీ ఇప్పటికీ అది నెరవేరలేదన్నారు. జమ్ము కాశ్మీర్‌లోని పహల్గంలో పాకిస్తాన్ ఉగ్రవాద మూకలు 26మంది దేశ పౌరుల ప్రాణాలను బలి గొన్నారని ఈ ఘటనను దేశ ప్రజలంతా ఐక్యమై ఖండించారని తెలిపారు. దాంతో పాకిస్తాన్‌తో యుద్ధం అనివార్యం అనుకున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించేలా ఇరుదేశాల ప్రధానులతో మాట్లాడి యుద్ధాన్ని విరమింప చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దానిని బిజెపి, కేంద్ర ప్రభుత్వం వారి గొప్పతనంగా చెప్పుకుంటూ తిరంగా యాత్రలను నిర్వహిస్తూ మతాల మధ్య చిచ్చు పెట్టడం దారుణమన్నారు. ఈ యాత్ర దేవరపాలెం, ములుమూడి, సౌత్ మోపూరు వరకు ఈ యాత్రలు జరిగాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎంవి రమణ, అట్లా అనిల్, పాదర్ధి మస్తానయ్య, ఎడవల్లి రమణయ్య, శ్రీపతి వెంకయ్య, ముత్యాల నాగయ్య, పాదర్తి నారాయణ, శ్రీపతి వెంకట శేషయ్య, పసల వెంకటరమణయ్య, కొర్ర పాపయ్య, సాదేపల్లి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.


జలదంకిలో...

ప్రజాశక్తి-జలదంకి : సిపిఎం రాష్ట్ర కమిటీ కేంద్ర కమిటీ పిలుపులు అనుసరించి మంగళవారం మండల కేంద్రమైన జలదంకిలో సమైక్యతా యాత్ర నిర్వహించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం అని అమెరికాకు లొంగుబాటు చేసిన కేంద్ర బిజెపి వైఖరిని నిరసిస్తూ సిపిఎం కార్యాలయం నుండి గట్టుపల్లి రోడ్డు హరిజనవాడ కేంద్రం నుంచి ప్రదర్శనగా బస్టాండ్ సెంటర్‌కి చేరింది. ఈ సందర్భంగా ప్రదర్శకులు మోడీ ట్రంపునకు లొంగుబాటు అవటం సిగ్గు అని అదేరకంగా దేశ ప్రజల ఐక్యత వర్ధిల్లాలని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటంలో ప్రజలందరూ పాల్గొనాలని దేశంలోని హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు ఐక్యంగా ఉండి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని నినదించారు. యుద్ధం చేసామని ప్రగల్భాలు పలకడం తప్ప ఆచరణలో ఉగ్రవాదులను పట్టుకోలేదని ఉగ్రవాదాన్ని అరికట్టలేదని ఈ సందర్భంగా మాట్లాడిన సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి ఘాటుగా కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు రావి మాల్యాద్రి, కన్వీనర్ గడ్డం మాల్యాద్రి, వ్యవసాయ కార్యదర్శి సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాధాకృష్ణ, వ్యవసాయ కార్మికుల సంఘం కార్యదర్శి వేలంగి ఆంథోని బాబు, బత్తల నరసింహ, దేవరకొండ బాలయ్య, కుట్టుబోయిన శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వైఇపిఎ రాష్ట్ర యాదవ ఉద్యోగ సంఘం, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో 470పైగా మార్కుల సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని రాష్ట్ర అధ్యక్షులు గుర్రం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలో రాష్ట్ర యాదవ ఉద్యోగ సంఘం, ప్రొఫెషనల్ అసోసియేషన్ (వైఇపిఎ) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఇపిఎ (యాప) సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుర్రం.నాగేశ్వరరావు యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో వీరితోపాటు వైఇపిఎ సభ్యులైన కటారి సుధాకర్ యాదవ్, గాలిపోయిన అయ్యన్న యాదవ్, దేవరాల వెంకటరమణ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో 2025 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాసి 470 పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కార నగదు బహుమతిని జూన్ 1వ తేదీన నెల్లూరులోని కొండాయపాలెం గేటు వద్ద ఉన్న యాదవ భవనంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి గొలుసు పార్థసారథి, సంఘ పెద్దలందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ నగదు బహుమతి అందుకునేందుకు పదో తరగతి పరీక్షలలో 470కుపైగా మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలకు చెందిన యాదవ విద్యార్థులు తమపేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. తమపేర్లను నమోదు చేసుకోవడానికి పేలం సురేష్ బాబు 9705800794 నెంబర్‌కు గాని లేదా కటారి.సుధాకర్ 9573105305 నెంబర్‌కు గానీ ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్పులు సాధించిన యాదవ విద్యార్థులకు అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

పలుచోట్ల 'యోగాంధ్ర' శిక్షణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం పరిధిలో వివిధ కార్యాలయాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం గ్రామ పరిధిలో యోగాంధ్ర శిక్షణ కోసం మండల పరిధిలోని అధికారులకు, ఇతర సిబ్బందికి ఒకరోజు ఇచ్చిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఒ.టి.లు దోబగుంట జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయురాలు పి.సుజన, ఎఎస్‌పేట జెడ్‌పి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సురేష్ బాబు, గుంపర్లపాడు వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వాసుదేవరావు వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అతి తక్కువ సంఖ్యలో కేవలం మండలం మొత్తం కలిపి 132 మంది మాత్రమే పాల్గొనడం జరిగింది. మండలస్థాయిలో ఒక్క సచివాలయ వ్యవస్థలోనే 117మంది విధులను నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శిక్షణ ఇచ్చుటకు గానూ అనువైన ప్రదేశం లేక కొంతమంది అధికారులు బయట నిలబడి శిక్షణకు హాజరయ్యారు. కావున ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, శిక్షణకు హాజరుకాని మండల స్థాయిలోని అధికారులకు మరొక మారు శిక్షణను నిర్వహించి, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయిలో చేయబోతున్న కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సక్సెస్ చేయాలని, మండల నాయకులు కోరుతున్నారు.

ప్రజాశక్తి-కోవూరు : యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక దినచర్యగా ఉండేటే మంచిదని యోగా అనేది ఒక భిన్నమైన విధానమని, ఇది ప్రతి వ్యక్తిని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేలా చేస్తుందని న్యాయవాది, యోగా గురువు సలీమ్ తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల స్థాయి అధికారులకు సచివాలయ ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఈ యోగాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలనే ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఈ యోగానంద పక్ష మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి, వార్డు స్థాయి వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి నిర్మలాదేవి, ఆయుర్వేద వైద్యులు గంగాధర్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆధార్‌కార్డులకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో ఉన్న సచివాలయాలలో గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జూన్ రెండో తేదీ నుండి 8వ తేదీ వరకు ఆధార్ డ్రైవ్ కార్యక్రమాన్ని బోగోలు మండలంలో ఉన్న అన్ని సచివాలయాలలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బోగోలు మండలంలో ఉన్న సచివాలయాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు గిరిజన ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఆధార్ కార్డులు లేని వారు ఆధార్ కార్డులో తప్పులు ఉన్న గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఐడిఎస్ఎంటి ప్లాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కావలి : కావలి పురపాలక సంఘం పరిధిలో వున్న ఐడిఎస్ఎంటి మిగిలిన ప్లాట్ల విషయమై భౌతిక సర్వేను మంగళవారం కావలి మున్సిపాలిటీ కమిషనరు జి.శ్రవణ్ కుమార్, అగ్రికల్చర్ రీసర్వే ఆఫీసరు కావలి వారు కలిసి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం టౌన్స్ ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంలో వ్యవసాయ శాఖ అధీనంలో ఉన్న భూమిని సర్వే చేయించి సర్వే ప్రకారం కావలి పురపాలక సంఘం వారికి స్వాధీనపరచే విషయంపై తగుచర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు.

ఈసీ సభ్యులతో సమావేశం

ప్రజాశక్తి-సంగం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం వెలుగు ఎపిఎం రవిశంకర్ రెడ్డి పొదుపు సభ్యులతో ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్త్రీ నిధి రుణాల రికవరీ 100 శాతం ఉండాలని సూచించారు. అదేవిధంగా రుణాల రికవరీ సక్రమంగా చెల్లించాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు ఉన్నతి పథకం కింద రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని ఎస్సీ ఎస్టీ పొదుపు సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. పొదుపు మహిళలు మహిళా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నామని తెలియజేశారు.

'కందుకూరు'కు నివాళులు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రమైన అనంతసాగరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల 30వ రోజైన మంగళవారం నాడు హాజరైన విద్యార్థులతో తెలుగు కథల పుస్తకాల నుండి కథలు చదవడం, చెప్పించడం వంటి కార్యక్రమాలను గ్రంథ పాలకురాలి నారాయణ రావు నిర్వహించారు. తదనంతరం తెలుగు పునరుజ్జీవోద్యమ పితామహుడు, స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించిన తొలినాటి సామాజిక సంఘసంస్కర్త నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులు 106వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకురాలి వీరేశలింగం పంతులు జీవిత విశేషాలను ఆనాటి సమాజంలో పాతిస్తున్న బాల్య వివాహాలు, వరకట్న వ్యవస్థ పై పంతులు పోరాడిన తీరును విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు వల్లూరు రాజేష్ రెడ్డి, కర్నేటి దేవరాయపల్లి పుస్తక పంపిణీ కేంద్ర నిర్వాహకుడు పరంకుశం భాను ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, విడవలూరు మండలాల్లో పశుకిసాన్ క్రెడిట్ కార్డులపై భూమి లేని పాడి రైతుల్లో అవగాహన కల్పించేలా పశువైద్యులు, పశు సహాయకులు తగు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశువైద్యశాల సమావేశ మందిరంలో మంగళవారం సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు సంబంధించిన పశువైద్యులు, పశు సహాయకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాడి రైతుల్లో భూమి లేని రైతులను గుర్తించి అటువంటి వారి వివరాలను ఆన్లైన్ నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఇప్పటికే ఈ సర్వే వచ్చే వ్యాధులను సంబంధించిన టీకాలు కూడా పాడి పశువులకు వేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ వాణి శంకర్, డాక్టర్ ఎ బాబా, డాక్టర్ ప్రీతి సల్మాన్, తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సిడిపిఒ జ్యోతి అన్నారు. కోవూరు మండలం లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల అంగన్వాడీ కార్యకర్తలకు ప్రీ ప్రైమరీ పాఠశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని, దానిని తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి చిన్నారి, బరువు, ఎత్తులను ప్రతినెలా 10వ తేదీలోగా ఖచ్చితంగా యాప్ ఆన్లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.

పోలీసులపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-బిట్రగుంట



తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత మైనారిటీ యువకుల పైన అక్కడి పోలీసులు చేసిన థర్డ్ డిగ్రీ ప్రయోగం హేయమైన చర్యని, అది మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని, ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకూడదు ఉండాలంటే హైకోర్టు వారు ఈ సంఘటన సుమోటో కింద కేసు నమోదు చేసి ఇరువురి సిఐ పైన సంబంధిత పోలీస్ అధికారుల పైన కచ్చితంగా కేసు నమోదు చేసి విచారణ జరపాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా చీఫ్ దాసరి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. తెనాలిలో దళిత యువకులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ బోగోలు కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి వారు మాట్లాడుతూ పోలీసులపై వారు ప్రవర్తించిన తీరు తప్పు చేసుండొచ్చు కానీ తప్పునకు నడిబజారులో మానవ హక్కుల ఉల్లంఘన జరిగే విధంగా దారుణంగా కొట్టడం అనేది చట్టాన్ని చేతిలోకి తీసుకోవడమే అని తెలిపారు. పోలీసులు వారిపై ప్రవర్తించిన తీరుపై వారు అవమానం భరించలేక మనస్థాపంతో ఆత్మహత్య చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ ఘటనపై హైకోర్టు వారిపై సుమోటుగా కేసు తీసుకొని అధికారులపై కేసు రిజిస్టర్ చేసి విచారణ జరిపించాలన్నారు. ఒక సస్పెన్షన్‌తో సరిపెట్టితే భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు ఎన్నో జరుగుతాయి కాబట్టి వాటిని అరికట్టాలంటే కచ్చితంగా పోలీసు వారిపై కేసు నమోదు చేయాలని, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ చీఫ్, సంఘాల సభ్యులందరూ ఈ ఘటనపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సెక్రటరీ ఎస్.కె, నూరుద్దీన్, జాయింట్ సెక్రెటరీ బత్తుల రవిచంద్ర, ఒఆర్‌జి సెక్రటరీ శివకుమార్, హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తటవర్తి వాసు పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ టిడిపి సీనియర్ నాయకుడు తటవర్తి వాసు పుట్టినరోజు సందర్భంగా కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కడపలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జ్ బిటెక్ రవి పాల్గొన్నారు. ఎంఎల్ఎ, టిడిపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి, తటవర్తి వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత



ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండలం విరువూరు గ్రామానికి చెందిన బాలిక ఆదివారం సాయంత్రం తప్పిపోవడంతో ఫిర్యాదు అందిన వెంటనే ఎస్ఐ రఘునాథ్, వారి సిబ్బంది శ్రీ కాళహస్తిలో ఉన్న బాలికను కనిపెట్టి సోమవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దాంతో బాలిక తల్లిదండ్రులు, మండల ప్రజలు, ఎస్ఐ రఘునాథ్‌పై హర్షం వ్యక్తపరిచారు.

కావలి డిపోకు అవార్డు

ప్రజాశక్తి-కావలి



కావలి ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు నేతృత్వంలో సిబ్బంది కావలి డిపోకు ఎపిఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ "ఇందన సామర్థ్యం" అవార్డు సాధించారని జిల్లా ప్రజా రవాణా అధికారి మురళీ బాబు పేర్కొన్నారు. మంగళవారం కావలి డిపో గ్యారేజీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును డిపో మేనేజర్ శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంకు గాను, కావలి డిపోకు నిర్ధేశించిన ఇందన పొదుపు (కెఎంపిఎల్) లక్ష్యాన్ని సాధించి ఈ అవార్డును అందుకున్నారన్నారు. ఈ అవార్డు సాధనలో డిపో మేనేజర్, సూపర్‌వైజర్ల ప్రేరణ, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది కృషి అభినందనీయమని వివరించారు. కావలి డిపో జిల్లాలోని మిగతా డిపోలకు ఆదర్శంగా నిలుస్తుందని, 2025-26 సంవత్సరానికి నిర్ధేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్కె.ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పన, కెఎంపిఎల్ మెకానిక్ పాండురంగరావు, ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

29న మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనంతసాగరం

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా అనంతసాగరం ఎస్‌సి కాలనీ వద్ద 29వ తేదీన వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సిపిఎం అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్‌బాషా తెలిపారు. కంటిచూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. కావున మండల ప్రజలు ఈ అవకాశంను ఉపయోగించుకోవాలన్నారు.

జామాయిల్ రవాణా అడ్డగింత

ప్రజాశక్తి-ఉదయగిరి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అక్రమంగా జామాయిల్‌ను నరికి తరలిస్తున్న 3 లారీలను ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శీనయ్య పట్టుకొని కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తిరుమలపురంలోని 70 ఎకరాల అగ్రిగోల్డ్ భూముల్లో కొంతమంది అక్రమార్కులు జామాయిల్ చెట్లు నరికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారని గ్రామస్తులతో విషయం తెలుసుకున్న అగ్రిగోల్డ్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన ప్రాంతానికి చేరుకొని తరలించేందుకు జామాయిల్ మొద్దులతో సిద్ధంగా ఉన్న మూడు లారీలను కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం అదుపులోకి తీసుకున్న కూలీలను విచారించగా అనంతసాగరం పాముూరు వివిధ గ్రామాల నుండి కూలీలతో లారీ డ్రైవర్లు వారి సిబ్బంది కూలీలతో 40మంది వచ్చినట్లు గుర్తించి వారిని విచారించగా ఉదయగిరి మండలం నేలటూరు గ్రామానికి చెందిన ఇత్తడి శ్రీను చెట్లు ను నరికేందుకు పిలిపించారని వచ్చినట్లు ముఠాకూలీలు తెలిపారని వాటిపై కేసు నమోదు చేసి పూర్తి సమాచారం కోసం విచారణ చేపడుతున్నట్లు వారు తెలిపారు.

పొగాకు వేలం పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు



ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య కందుకూరు 26, 27 తేదీల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు కొనుగోలులో అసంబద్ధమైన విధానం కొనసాగుతుందన్నారు. గత సంవత్సరం కేజీ పొగాకు ధర రూ.350, కనిష్ట ధర రూ.235 పలుకగా, ఈ ఏడాది గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠధర రూ.200లతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు పండించిన పూర్తిస్థాయి పొగాకును కంపెనీల వాళ్ళు కొనుగోలు చేయడం లేదని రైతు సంఘం నాయకులతో స్థానిక రైతులు తెలిపారు. పొగాకు కొనుగోలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని పొగాకు బోర్డులకు, వివిధ కంపెనీల యజమానులతోనూ సంప్రదింపులు జరిపి గిట్టుబాటు ధరకు పొగాకును కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్న పొగాకుకు కేజీ సగటు ధర రూ.300 ఇవ్వాలని, అలా ఇవ్వని పక్షంలో రైతులకు బ్యారెన్‌కు రూ.5 లక్షలు వరకు నష్టపోయే అవకాశం ఉందని, ఈ పరిస్థితులు పొగాకు రైతులను తీవ్రమైన నష్టాలకు గురిచేసి ఆత్మహత్యలకు ప్రేరేపిస్తాయని, అలాంటి పరిస్థితులు ఏర్పడక ముందే ప్రభుత్వాలు కళ్ళు తెరిచి రైతులను ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో రైతుసంఘం రైతులతో కలిసి ఆందోళన చేస్తుందని వారు హెచ్చరించారు. స్థానిక నాయకులు వెంకటేశ్వరరావు, గౌష్, కుమార్ ఉన్నారు.

చెత్తసంపద కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-సంగం : సంగంలో చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో చెత్త సేకరణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 720 పంచాయతీలకు గానూ 200 గ్రామ పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ విజయవంతంగా జరుగుతుందని స్పష్టం చేశారు. చెత్త సేకరణ సేవలు ఎలా ఉన్నాయో అని ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నామన్నారు. 60శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. నిధులు అవకతవకలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్ ఏర్పాటు చేసిందన్నారు. పంచాయతీలో ట్రాన్సాక్షన్స్ అన్ని స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌లోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత రకరకాల కారణాలతో అవకతవకలకు పాల్పడిన 20 మంది పంచాయతీ కార్యదర్శులు సస్పెండ్ అయ్యారని తెలిపారు. పిఆర్-1 యాప్ ద్వారా పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ నయీం తాజ్‌హసన్, ఇఒపిఆర్‌డి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.